గ్రీన్ బెల్ట్ కనుమరుగు

- యథేచ్ఛగా ఆక్రమణలు
- వ్యాపార సముదాయాల ఏర్పాటు



68వ వార్డు అక్కిరెడ్డిపాలెం వైపు ఇలా..



నాతయ్యపాలెం సర్వీసు రోడ్డు పక్కన కనిపించని గ్రీన్ బెల్ట్

అక్కిరెడ్డిపాలెం: కాలుష్యాన్ని నివారించి, పచ్చదనాన్ని పెంపొందించేందుకు కేటాయించిన గ్రీన్ బెల్ట్ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. ఆ స్థలాల్లో వ్యాపారాలను నిర్వహిస్తూ అక్రమార్కులు లక్షల్లో ఆదాయం ఆర్జిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. గాజువాక నుంచి షీలానగర్ వరకు జాతీయ రహదారి పక్కన సర్వీసు రోడ్డు నుంచి గ్రీన్ బెల్ట్ స్థలాలన్నీ ఆక్రమించి వ్యాపార, వాణిజ్య సముదాయాలను ఏర్పాటు చేసుకున్నారు. 69వ వార్డు నాతయ్యపాలెంలో సర్వీసు రోడ్డు వరకు వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేయడంతో, వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోంది.

68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో గ్రీన్ బెల్ట్ స్థలాలు కనుమరుగైపోయాయి. ఈ ప్రాంతంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఓ వ్యక్తి తనదికాని ఒక షాపును గ్రీన్ బెల్ట్‌లోనే నిర్మించినా, అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. గ్రీన్ బెల్ట్ స్థలాలను పలువురు హోటళ్లు, ఇతర వ్యాపార సముదాయాల ఏర్పాటుకు వినియోగిస్తున్నారు. రాత్రి సమయంలో రెండు వార్డుల్లో సర్వీసు రోడ్డుపై ప్రయాణించాలంటే భయంగా ఉంటోందని వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రీన్ బెల్ట్ స్థలాలు మాయం కావటం, సర్వీసు రోడ్డు కుచించుకుపోవడంతో పలువురు వాహనచోదకులు ప్రమాదాలబారిన పడుతున్నారు.

ఇప్పటికైనా నాతయ్యపాలెం, అక్కిరెడ్డిపాలెం ఇరువైపులా ఉన్న గ్రీన్ బెల్ట్ స్థలాలను సర్వే చేయించి, ఆక్రమణలను తొలగించాలని పలువురు కోరుతున్నారు. స్థలాలను స్వాధీనం చేసుకుని, హద్దులను ఏర్పాటు చేసి పచ్చదనాన్ని పెంపొందించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



అక్కిరెడ్డిపాలెంలో టీడీపీ నాయకుడు ఆక్రమించిన గ్రీన్ బెల్ట్ స్థలం

సర్వీస్ రోడ్డుపై ప్రయాణించాలన్నా భయమే..

నాతయ్యపాలెం నుంచి షీలానగర్ వరకు ఉన్న సర్వీసు రోడ్డుపై ప్రయాణించాలంటేనే భయంగా ఉంటోంది. గ్రీన్ బెల్ట్ స్థలంతో పాటు సర్వీసు రోడ్డునూ ఆక్రమించడంతో మార్గం కుచించుకుపోయింది. రాత్రి సమయంలో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారింది. ఆక్రమణలను తొలగించాలి.

–గురవయ్య, వాహనచోదకుడు, ఎన్‌ఏడీ కొత్త రోడ్డు

ఆక్రమణలను తొలగించాలి

అక్కిరెడ్డిపాలెం నుంచి షీలానగర్ వరకు సర్వీసు రోడ్డు పక్కన గ్రీన్ బెల్ట్ స్థలం పూర్తిగా ఆక్రమణకు గురైంది. గ్రామంలో గ్రీన్ బెల్ట్ స్థలంలో హోటళ్లు, ఇతర వాణిజ్య దుకాణాలు ఏర్పాటు చేశారు. ఆ వాణిజ్య సముదాయాలను తొలగించి పచ్చదనం పెంపొందించాలి.

–వెంకటరమణ, స్థానికుడు, అక్కిరెడ్డిపాలెం

క్లుప్తంగా

'ఉక్కు కార్మికులకు మిగులు బోనస్ చెల్లించాలి'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు దసరా మిగులు బోనస్ వెంటనే చెల్లించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎండీ అతుల్ భట్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. సెయిల్ యాజమాన్యం దసరా బోనస్ ఒప్పందం మేరకు ఈ నెల 10న అక్కడి కార్మికులకు మిగులు రూ.9500 చెల్లించిందని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోనూ అదేవిధంగా చెల్లించాలని కోరారు.

సాయినాథునికి వెండి బిందె, కలశం బహూకరణ



ఆలయ కమిటీ చైర్మన్ బండి శ్రీనివాసరావుకు వెండి బిందె, కలశం అందజేస్తున్న దాతలు

పెదగంట్యాడ: స్థానిక సమతానగర్‌లోని షిర్డీ సాయి శాంతిధామంలో కొలువైన సాయినాథునికి వెండి బిందె, కలశాన్ని బహూకరించారు. స్థానిక వినాయకనగర్ వుడా కాలనీకి చెందిన మాణిక్యాల శ్రీనివాసరావు, ఇందిరారాణి దంపతులు రూ.ఒక లక్షా రెండు వేల విలువైన కిలో వెండి బిందె, 401 గ్రాముల కలశాన్ని ఆలయ కమిటీ చైర్మన్ బండి శ్రీనివాసరావుకు అందజేశారు. కార్యక్రమంలో వీజీకే రెడ్డి, డీఎల్ రెడ్డి, కె.సత్యంబాబు, పైల రామారావు, సీహెచ్ మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



మందులు అందిస్తున్న ఎన్టీపీసీ హెచ్‌ఆర్ ఏజీఎం రుమా దే శర్మ, కార్పొరేటర్ సూర్యకుమారి

పెదగంట్యాడ: ఎన్టీపీసీ సింహాద్రి ఆధ్వర్యంలో జీవీఎంసీ 77వ వార్డు పరిధి పిట్టవానిపాలెం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, ఎన్టీపీసీ హెచ్‌ఆర్ ఏజీఎం రుమా దే శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా 300 మంది రోగులను వైద్యులు పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ ఈఎంజీ ఏజీఎం వి.జయన్, మెడికల్ ఆఫీసర్ ఎన్వీ కల్యాణ్, హెచ్‌ఆర్ మేనేజర్ కె.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

'సొసైటీలకు యాజమాన్య ప్రతినిధులను నియమించాలి'

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌ఈఎల్‌లో సహకార సంఘాలకు యాజమాన్య ప్రతినిధులను నియమించాలని సంస్థ సీఐటీయూ సంఘం యాజమాన్యానికి మెయిల్ ద్వారా విన్నవించినట్లు సిటూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల కుటుంబాలకు సహకార సంఘాలు, సొసైటీలు ఎంతో ఉపయోగకరంగా ఉండేవన్నారు. వెంటనే ఆయా సంఘాలకు ప్రతినిధులను నియమించాలని సిటూ సంఘాల తరఫున యాజమాన్యానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో సిటూ నాయకులు కె.విజయ్ కుమార్, ఎస్.జగన్నాథరావు, పి.కనకారావు, ఎస్.అప్పారావు, జి.రాంబాబు, బి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు ప్రారంభం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్ హబ్(ఏయూ టీడీఆర్ హబ్) ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాన్ని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత ప్రత్యక్షంగా పరిశీలించారు. ఏయూ టీడీఆర్ హబ్‌లో ప్రవేశం పొంది 18 నెలల కాలం ముగిసిన వారికి ప్రీ పీహెచ్‌డీ పరీక్షలను నిర్వహిస్తున్నట్టు హబ్ డైరెక్టర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తెలిపారు. పరీక్షలు పటిష్టంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంపై రెక్టార్ సంతృప్తి వ్యక్తం చేశారు.

స్వైన్ ఫీవర్, బ్యాక్టీరియా కారణంగానే..

- పందుల మృత్యువాత
- నివారణకు వ్యాక్సిన్లు సిద్ధం
- అధికారుల వెల్లడి



పందుల పెంపకందారులకు సూచనలు ఇస్తున్న పశువైద్యాధికారి విజయ్‌కుమార్

పెదగంట్యాడ: పందుల మృత్యువాతకు ప్రధానంగా క్లాసికల్ స్వైన్ ఫీవర్, బాక్టీరియా కారణంగా తెలుస్తోందని గాజువాక, పెదగంట్యాడ పశువైద్యాధికారి డాక్టర్ విజయ్‌కుమార్ పాణిగ్రాహి ఒక ప్రకటనలో తెలిపారు. సామర్లకోటలోని వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ అధికారులు దీనిని నిర్ధారించారని వివరించారు. స్వైన్ ఫీవర్ నివారణకు వ్యాక్సిన్లు సిద్ధం చేశామని, అవి వేసే వరకు పందులను జాగ్రత్తగా చూసుకోవాలని పెంపకందారులకు సూచించారు. మృత్యువాత పడిన పందులను గెడ్డల్లో పడేయవద్దని, దీని వల్ల రోగాలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వాటిని డంపింగ్ యార్డ్ వద్ద కేటాయించిన స్థలంలో పూడ్చిపెట్టాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో పెంపకందారులు 1962 టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అందుబాటులో వ్యాక్సిన్లు

విశాఖ జిల్లాకు సంబంధించి 2300 క్లాసికల్ స్వైన్ ఫీవర్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామ్మోహన్ పేర్కొన్నారు. ఇప్పటికే పశువైద్య సిబ్బంది మూడు బృందాలుగా జిల్లాలో పర్యటిస్తూ పందులకు టీకాలు వేస్తున్నారని వివరించారు.

బాడీబిల్డింగ్ పోటీల్లో ప్రతిభ



విజేతను అభినందిస్తున్న యాజమాన్య ప్రతినిధులు

అగనంపూడి: ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో నిర్వహించిన 25వ మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్–2023 పోటీల్లో దువ్వాడ విజ్ఞాన్ కళాశాల విద్యార్థి ఎస్.షణ్ముఖవెంకటసునీల్ నాలుగో స్థానంలో నిలిచాడు. సునీల్‌ను కళాశాల రెక్టార్ డాక్టర్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ అరుంధతి అభినందించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు సీహెచ్.రాంబాబు, జి.ప్రశాంత్, డాక్టర్ పి.ఎస్.వి.రమణ, ఎ.భారతి పాల్గొన్నారు.

భద్రతకే ప్రథమ ప్రాధాన్యం



భద్రతా దినోత్సవంలో పాల్గొన్న అధికారులు

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్‌లో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని స్టీల్‌ప్లాంట్ సేఫ్టీ (ప్రాజెక్ట్స్) హెచ్‌వోడీ దువ్వాడ రాజేంద్రప్రసాద్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ సేఫ్టీ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అగనంపూడిలో గురువారం నిర్వహించిన భద్రతా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా స్టీల్ పరిశ్రమల్లో మార్చి 28వ తేదీన భద్రతా దినోత్సవాన్ని నిర్వహిస్తారన్నారు. అందులో భాగంగా ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కాంట్రాక్ట్ కార్మికులకు విధినిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తలపై శిక్షణ ఇస్తారని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ ఎస్‌ఐ జి.మహాలక్ష్మి మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. స్టీల్‌ప్లాంట్ సేఫ్టీ మేనేజర్ జి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సేఫ్టీ మేనేజర్ ఎస్.సందీప్, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, గంతకోరు అప్పారావు, వంకర రాము తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యానికి క్రీడలు దోహదం



విజేతలతో సినీ నటుడు సుమన్ తదితరులు

గాజువాక: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలను కూడా నేర్పించాలని సినీ నటుడు, మార్షల్ ఆర్ట్స్ చైర్మన్ సుమన్ అన్నారు. గాజువాక బీసీ రోడ్‌లోని బ్యాల స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కరాటే పోటీల్లో విజేతలకు గురువారం ఆయన పతకాలు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరగడానికి క్రీడలు దోహదపడతాయన్నారు. క్రీడలు సాధన చేసే విద్యార్థులు చదువులో కూడా రాణిస్తారన్నారు. 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహ పాత్రుడు, రాష్ట్ర కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు, బ్యాల స్కూల్ ప్రిన్సిపాల్ గిరి, కరాటే సంఘం సభ్యులు సతీష్ కుమార్, అంగా రాము, శివ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

'క్షయపై ఆందోళన చెందవద్దు'

అక్కిరెడ్డిపాలెం: క్షయపై ఆందోళన చెందవద్దని, మంచి మందులతో వ్యాధికి చెక్ పెట్టవచ్చని షీలానగర్ కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ కె.ఎస్.ఫణీంద్ర కుమార్ అన్నారు. మార్చి 24న అంతర్జాతీయ క్షయ వ్యాధి నిర్మూలనా దినోత్సవాన్ని పురస్కరించుకొని హాస్పిటల్‌లో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఊపిరితిత్తుల టీబీ ఉన్న వ్యక్తి తుమ్మినా, దగ్గినా, ఉమ్మినా, నవ్వినా, మాట్లాడినా గాలిలో తుప్పర్లు వ్యాపించినప్పుడు వాటిని పీల్చడం ద్వారా వ్యాధి సంక్రమిస్తుందన్నారు. ధూమపానం, పొగాకు నమలడం, ఆల్కహాల్, పోషకాహార లోపం, మధుమేహం, హెచ్ఐవీ, వృద్ధాప్యం వంటివి టీబీని వృద్ధి చేసే కారణాలుగా చెప్పవచ్చన్నారు. సకాలంలో గుర్తించి, మందులను వాడటం ద్వారా వ్యాధిని అరికట్టవచ్చని సూచించారు.

నల్లబ్యాడ్జీలతో స్టీల్‌ప్లాంట్ అధికారుల నిరసన



స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తున్న అధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అధికారులు తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ గురువారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఉక్కు అధికారుల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఉక్కు అధికారుల సంఘం (సీ) ఆందోళన బాట పట్టింది. ఇందులో భాగంగా మూడు రోజుల పాటు నల్లబ్యాడ్జీలతో విధులను నిర్వర్తించనున్నారు. వివిధ విభాగాల్లోని సీ ప్రతినిధుల నేతృత్వంలో ప్లాంట్‌లోని అన్ని విభాగాలకు చెందిన అధికారులు బ్యాడ్జీలు ధరించారు. పదోన్నతులను వెంటనే రిలీజ్ చేయాలని, 2021–22కు సంబంధించి పీఆర్పీ చెల్లించాలని, మూడో వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.డి. ప్రసాద్, ఉపాధ్యక్షుడు చంద్ర వెంకటేశ్వరరావు తదితరులు ఆయా విభాగాల్లో పర్యటించి, నిరసనల్లో పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



కన్నూరు చిన్నమ్మలు (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: గ్యాస్ లీకై, మంటలు వ్యాపించిన ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన మహిళ, చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మరణించింది. ఘటనకు సంబంధించి గాజువాక సీఐ ఎల్.భాస్కరావు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాపీ మేస్త్రిగా పని చేస్తున్న కన్నూరు కరుణ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో భార్య చిన్నమ్మలు (38), కుమార్తెలు యామిని, శరణ్యలతో నివసిస్తున్నారు. చిన్నమ్మలు మంగళవారం ఉదయం వంటగదిలో గ్యాస్ స్టౌ వెలిగించగా.. అప్పటికే గ్యాస్ లీకై, గది అంతా వ్యాపించడంతో, ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఘటనలో చిన్నమ్మలు బాగా గాయపడింది. వెంటనే స్థానికులు 108కు సమాచారం అందించడంతో, ఆమెను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. 70 నుంచి 80 శాతం కాలిన గాయాలతో రెండు రోజుల పాటు మృత్యువుతో పోరాడిన చిన్నమ్మలు బుధవారం అర్ధరాత్రి దాటిన సమయంలో మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించారు. మృతురాలు చిన్నమ్మలు షీలానగర్‌లోని ఒక వాహన కంపెనీలో పని చేసేవారని బంధువులు తెలిపారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు గాజువాక ఎస్‌ఐ సూర్యకళ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టనున్నట్లు తెలిపారు.

'కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలి'



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేస్తూ, కార్మిక వర్గాన్ని అణచివేసే కేంద్రప్రభుత్వ విధానాలను ప్రజలందరూ ఐక్యంగా తిప్పికొట్టాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 770వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని సింటర్ ప్లాంట్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమలను నాశనం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, ఈ ప్రయత్నాలను సంస్థలోని కార్మికులతో పాటు దేశంలోని ప్రజలందరూ ఐక్యంగా ఉండి ఎదుర్కోవాలని కోరారు. దేశంలోని సంపదను ప్రైవేట్ వ్యక్తులకు దోచిపెట్టే హక్కు కేంద్రానికి లేదన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాల ప్రదానం



డాక్టర్ నవీన్‌కుమార్‌కు పురస్కారం అందజేస్తున్న స్టీల్‌క్లబ్ ప్రతినిధులు

ఉక్కునగరం: వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారికి ఉగాది పురస్కారాలు అందజేశారు. స్థానిక స్టీల్‌క్లబ్‌లో నిర్వహించిన ఉగాది వేడుకల్లో భాగంగా ఉక్కు జనరల్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ఎ.పి. నవీన్ కుమార్, డాక్టర్ జి. సుజాత, ఉక్కు అధికారుల సంఘం ప్రధానకార్యదర్శి కె.వి.డి. ప్రసాద్, అథ్లెట్ వరలక్ష్మి, వాలీబాల్ క్రీడాకారులు ఎం. మురళీమోహన్‌లకు ఉగాది పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్‌కు చెందిన కవులు ఉగాది కవితలను వినిపించారు. కార్యక్రమంలో భాగంగా 10 మంది కవులను సత్కరించారు. ముందుగా స్టీల్‌ప్లాంట్ పీపీఎం విభాగం జీఎం డాక్టర్ రమాదేవి ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ప్రముఖ పండితులు అద్దంకి రాఘవాచార్యులు పంచాంగం వినిపించారు. కార్యక్రమంలో స్టీల్‌క్లబ్ కార్యదర్శి నారాయణ దొర, సంయుక్త కార్యదర్శి కె. శ్రీనివాస్, కోశాధికారి ఆర్. సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మహోన్నత పోరాట యోధుడు భగత్ సింగ్



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సీపీఎం కార్యదర్శి రాంబాబు

గాజువాక: భారతదేశ స్వాతంత్య్ర పోరాటంలో భగత్ సింగ్ ఒక విశిష్టమైన నాయకుడని సీపీఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు అన్నారు. 67వ వార్డు సాయిరామ్‌నగర్‌లో గురువారం నిర్వహించిన భగత్‌సింగ్ 92వ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. భారతీయులకు కొన్ని హక్కులు కావాలంటూ కొంతమంది నాయకులు బ్రిటిష్‌వాళ్లను వేడుకొంటున్న తరుణంలో, మనకు సంపూర్ణ స్వాతంత్య్రం కావాలని నినదించిన ధీరుడు భగత్‌సింగ్ అన్నారు. స్వాతంత్య్ర పోరాటాన్ని విస్తృతం చేయడం కోసం యువతను ఆకర్షించారని అన్నారు. దేశ స్వాతంత్య్రం కోసం తన మరణాన్ని కూడా ఉపయోగించుకోవాలన్న లక్ష్యంతో తన సహచరులు సుఖ్‌దేవ్, రాజ్‌గురులతో కలిసి 23 ఏళ్ల వయస్సులోనే ఉరికంబాన్ని ఎక్కారన్నారు. నిరంతర అధ్యయనం, స్వతంత్ర పరిశీలన, నిర్దాక్షిణ్యమైన విమర్శ తదితర అంశాలను భగత్‌సింగ్ జీవితం నుంచి ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు పాలూరి లక్ష్మణస్వామి, స్థానిక నాయకులు లక్ష్మణరావు, కుమార్, పద్మజ, లక్ష్మి, సూర్యకుమారి, షేక్ మదీనా తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న గిరిజన పూజారులు



సింహగిరిపై గిరిజన పూజారులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లా లోని పలువురు గిరిజన పూజారులు దర్శించుకున్నారు. ఆ జిల్లాలోని పలు గ్రామాల్లో విశ్వ హిందూ పరిషత్ ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి ఆలయాల్లో వీరంతా పూజారులుగా ఉన్నారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాలోని టీటీడీ నిర్మిస్తున్న 163 ఆలయాల్లో కూడా వీరంతా పూజారులుగా విధులు నిర్వహించనున్నారు. ఈ తరుణంలోనే గురువారం భీమిలిలో జరిగిన ఒక సమావేశానికి వచ్చిన వీరంతా తొలుత సింహాచలంలో స్వామివారిని దర్శించుకున్నారు. సింహాచలం దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, అల్లూరి జిల్లాలోని ఆలయాల నిర్మాణాల పర్యవేక్షకుడు రాంబాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ మురళి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అప్పన్నకు శాస్త్రోక్తంగా స్వర్ణపుష్పార్చన



గరుడసేవ నిర్వహిస్తున్న పురోహిత్ అలంకారి సీతారామాచార్యులు, పాల్గొన్న భక్తులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చనని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై వేంజేపచేశారు. 108 స్వర్ణ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళిని నిర్వహించారు. పూజలో పాల్గొన్న ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకుడు శ్రీకాంత్ తదితరులు ఈసేవను నిర్వహించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30గంటల నుంచి 10.30గంటల వరకు శ్రీ వరాహ నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణమంపడం లోని వేదికపై వేంజేప జేశారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు ,ప్రసాదాన్ని అందజేశారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేంజేంపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజను నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్ ఈపూజలో పాల్గొన్నారు.

గ్లోబల్ మిస్ ఇండియా పోటీలకు యశస్వి



జె.యశస్వి

అక్కిరెడ్డిపాలెం : ఢిల్లీలో మే 5 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న గ్లోబల్ మిస్ ఇండియా ఇంటర్నేషనల్ –2023 పోటీలకు విశాఖ భెల్ ఉద్యోగి జె.రాము కుమార్తె జె.యశస్వి ఎంపికయ్యారు. ఈ నెల 17న విశాఖలో ఒక ప్రముఖ హోటల్‌లో గ్లోబల్ మిస్ టీన్ ఇంటర్నేషనల్ 2023 బిగ్గెస్ట్ ఇండియా ఇంటర్నేషనల్ ఆడిషన్‌లో యశస్వి ఎంపికైందని ఆమె తండ్రి గురువారం తెలిపారు. ఆడిషన్లలో వివిధ రాష్ట్రాల నుంచి వందల సంఖ్యలో యువతులు హాజరయ్యారన్నారు. యశస్వి తల్లి జె.కరుణ శ్రీదేవి జ్యూడిషియల్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగిగా ఉన్నారు. యశస్వి బైపీసీ పూర్తి చేసుకొని నీట్‌కు ప్రిపేర్ అవుతున్నారు.

నేడు సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన

మద్దిలపాలెం : విశాఖ ఉషారాణి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలవారీ సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శించనున్నామని అసోసియేషన్ వ్యవస్థాపకుడు వంకాయల మారుతీ ప్రసాద్ తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రదర్శన ప్రారంభమవుతుందని తెలియజేశారు.